సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

శనివారం । 11 । మే । 2024



వైఎస్సార్‌సీపీలోకి చేరికలు

చెన్నూరు మండలంలోని కొండపేటకు చెందిన మాజీ ఉప సర్పంచ్ గుడిపాటి రాజేష్, ఎస్సీ కాలనీకి చెందిన 15 కుటుంబాలు శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. -VIIIలో



ఏపీఎల్ ఎంపికలకు విశేష స్పందన

వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో శుక్రవారం నిర్వహించిన ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) సీజన్-3 ఎంపికలకు విశేష స్పందన లభించింది. -VIIIలో

గరిష్టం/కనిష్టం
38.8/28.6

వాతావరణం

జిల్లాలో శుక్రవారం 28.6- 38.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలో మీటర్ల వేగంలో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

యువత క్రేజీ బైకులపై ర్యాలీగా వస్తున్నారు.. వాహనాల్లో దిగిన మహిళలు వడివడిగా నడుస్తున్నారు. మరికొందరు డప్పులు కొట్టుకుంటూ బలప్రదర్శనగా వెళ్తున్నారు. పిల్లాజల్లా.. ముసలీముతకా కళ్లల్లో కాంతినింపు కుంటూ అడుగులేస్తున్నారు. శుక్రవారం కడప నగరంలో కనిపించిన దృశ్యాలివి. ఏ వీధి చూసినా జనం కేరింతలే.. ఎటునుంచి వచ్చినా.. దారులన్నీ మద్రాస్ రోడ్డువైపే మళ్లాయి. కడప నగరమంతా ఒక్కచోటికి వచ్చి చేరింది. సీఎం వైఎస్ జగన్ రాకతో నగరం జనసంద్రమైంది.

- ఆద్యంతం ఉత్సాహంగా సాగిన వైఎస్ జగన్ ప్రసంగం
- అభిమానుల్లో ఉరకలెత్తిన ఉత్సాహం
- జనసంద్రమైన కడప నగరం



కడప నగరంలోని వన్ టౌన్ సర్కిల్ వద్ద జరిగిన సభకు హాజరైన జనసందోహం (ఇన్‌సెట్) ఫ్యాన్ గుర్తు చూపిస్తూ ప్రసంగిస్తున్న సీఎం వైఎస్ జగన్



వన్స్‌మోర్ జగనన్న.. అభిమాని ఉత్సాహం

కడప గడపన సింహగర్జన

సాక్షి ప్రతినిధి, కడప: సీఎం వైఎస్ జగన్‌కు సొంత గడ్డపై మమకారం ఏపాటిదో మరోసారి తెలిసింది. కష్టాల్లో అండగా నిల్చిన తీరు గుర్తు చేసుకున్న విధం ముచ్చటేసింది. రాష్ట్రానికి రాజైనా తల్లికి బిడ్డే అన్నట్లుగా ముఖ్యమంత్రి, కడప ప్రజానీకం మధ్య పరస్పర భావోద్వేగం నగరం నడిబొడ్డున ఆవిష్కృతమైంది. 'నేను కష్టాలలో నష్టాలలో ఉన్నప్పుడు నన్ను కంటికి రెప్పలా చూసుకున్న గడ్డ, నేను పుట్టిన ఈ కడప గడ్డ, నాకు అత్యధిక మెజారిటీని కట్టబెట్టి నన్ను ఈ స్థానంలో కూర్చోబెట్టిన కడప గడ్డను, మిమ్మల్ని మీ బిడ్డ జగన్ మరిచిపోడు' అని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పినప్పుడు కడప ప్రజలు భావోద్వేగానికి గురయ్యారు. 'మీ అండగా మేమున్నాం జగన్' అంటూ కేరింతలు కొట్టారు. 'అన్నా...మేమున్నా'మంటూ యువత దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు చేశారు. 'నాయనా...మేముండగా ఏకష్టము రాదం'టూ మహిళలు చెమర్చిన కళ్లు తుడ్చుకుంటూ చెప్ప సాగారు. ఇదంతా పొట్టిశ్రీరాములు విగ్రహం చెంతన చోటుచేసుకున్న సన్నివేశం.

చంద్రబాబుతో జిల్లాకు చంద్రగ్రహణం...

చంద్రబాబు పాలనలో జిల్లాకు చంద్రగ్రహణం పట్టేది.చెప్పుకునేందుకు ఒక్కటంటే ఒక్కటి కూడా ఆయన పాలనలో నిర్దిష్టమైన అభివృద్ధి జిల్లాలో లేదు. పైపెచ్చు కడప గుండాలు, పులివెందుల రౌడీలంటూ కించపరుస్తూ వచ్చారు. ఈ పరిస్థితులల్లో మరోమారు మోసపోవద్దు జిత్తులమారి చంద్రబాబు అపద్దపు హామీలతో వస్తున్నాడని సీఎం వైఎస్ జగన్ హెచ్చరికలు చేయడంతో ప్రజలు ప్రతిస్పందించారు. ఇంతకు ముంపు చూశామన్నా జన్మభూమి కమిటీలతో వేధించారని కొందరు నినదిస్తే, నీరు-చెట్టు నిధులతో బుగ్గవంకలో కాలువలు తీసి దోపిడీ చేశారని మరికొందరు నినదించారు. జగన్‌మాటలకు ప్రజలు అనుకరిస్తూ మీకేం ఇబ్బంది లేదు, మేమంతా మీవెంటే కడప గడ్డ వైఎస్సార్‌సీపీ అడ్డా అంటూ కేరింతలు కొట్టారు.

కడపలో టీడీపీకి వణుకు...

సీఎం వైఎస్ జగన్ బహిరంగ సభతో టీడీపీకి వణుకు పుట్టింది. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ వేదికగా ఆరోపణలు చేస్తూ, పెట్టుడు మనుషులతో హైప్ క్రియేట్ చేస్తూ వచ్చిన ఆ పార్టీ అంచనాలు శుక్రవారంతో పటాపంచలయ్యాయి. వేలాదిగా కార్యకర్తలు ఒక్కచోటికి తరలివచ్చిన విధం, అశేష ప్రజానీకం మద్దతు సీఎం శ్రేణులను ఉత్తేజపరుస్తూ స్ఫూర్తిదాయక ప్రసంగం టీడీపీకి నిద్రపట్టకుండా చేయనున్నట్లు పలువురు వెల్లడిస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కడప గడ్డ సొంత బిడ్డగా మద్దతు ప్రకటించిన నేపథ్యంలో టీడీపీ ఆశలు గల్లంతయ్యినట్లు విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

ఓట్లు చీల్చే కుట్ర: కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే మన కన్నును మనమే పొడ్చుకున్నట్లే, ప్రతి ఓటు కూడా విలువైనది. చంద్రబాబును గెలిపించేందుకే మన ఓట్లు చీల్చేందుకే కాంగ్రెస్ రంగప్రవేశం చేసిందని సీఎం జగన్ చెప్పారు. చంద్రబాబు బహిరంగ కాపురం బీజేపీతో చేస్తూ చీకటి కాపురం కాంగ్రెస్‌తో చేస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ఓట్లు చీల్చాలనే కుట్రలను నిలువరించాలని ఎమ్మెల్యే అభ్యర్థిగా అంజద్ బాషాను నిలిపాం. కొంచెం కోపం ఉంటే మన్నించాలని సీఎం కోరారు. మీ బిడ్డ సీఎం కావాలంటే అంజాద్‌బాషా ఎమ్మెల్యే కావాలని గుర్తు పెట్టుకోవాలని అభ్యర్థించారు.



జై జగన్.. యువతి ఆనందోత్సాహం



మేముసైతం.. సభకు తరలివచ్చిన ముస్లిం మహిళలు



హల్‌సెల్.. అభిమాన నేతను సెల్‌లో బంధిస్తున్న యువకులు



హ్యాట్సాఫ్.. వైఎస్ జగన్‌ను చూసిన సంతోషంలో మహిళల కేరింత



అమరజీవి సాక్షిగా.. అభిమానుల కేరింతలు

న్యూస్‌రీల్

సైలెన్స్ పీరియడ్‌లో ఆంక్షలు కఠినతరం

కడప సెవెన్‌రోడ్స్: పోలింగ్ నేపథ్యంలో జిల్లాలో శాంతి భద్రతల దృష్ట్యా సైలెన్స్ పీరియడ్‌లో ఆంక్షలను కఠినతరం చేస్తామని జిల్లా ఎన్నికల అధికారి విజయ రామరాజు రాజకీయ పార్టీల ప్రతినిధులతో అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఎన్నికల సన్నద్ధత, ప్రవర్తనా నియమావళిపై ఆయన మాట్లాడారు. శనివారం సాయంత్రం 6 నుంచి సైలెన్స్ పీరియడ్ ప్రారంభం అవుతుందన్నారు. 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ మాట్లాడుతూ సైలెన్స్ పీరియడ్ లో ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలన్నారు.

ఓటర్లకు ఇబ్బందులు ఎదురుకాకూడదు

కడప ఎడ్యుకేషన్: ఓటింగ్ కోసం ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు వచ్చే స్థానిక ఓటర్లకు చెక్ పోస్టుల వద్ద ఎలాంటి ఇబ్బందులు పెట్టకుండా ఓటరు గుర్తింపు కార్డును చూసి జిల్లాలోకి అనుమతించాలని జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 13న జరిగే ఓటింగ్ ప్రక్రియ కోసం 11వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి శాంతి భద్రతల దృష్ట్యా 48 గంటల పాటు అంక్షలను కఠినతరం చేయడం జరుగుతుందన్నారు. ఈ రెండు రోజుల్లో ఇతర జిల్లాల నుంచి జిల్లాకు వచ్చే స్థానిక ఓటర్లుకు జిల్లా చెక్ పోస్టుల వద్ద, నియోజక వర్గాల చెక్ పోస్టు వద్ద ఓటర్లు గుర్తింపు కార్డును చూపించి స్థానిక ప్రాంతాలకు చేరుకుని తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చన్నారు. ఈ విషయంలో చెక్ పోస్టుల వద్ద ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కూడా ఓటర్లును ఇబ్బందులకు గురి చేయకుండా సహకరించాలన్నారు. తనిఖీల వద్దు ఏదైనా ఇబ్బందులు ఎదురైతే టోల్ ఫ్రీ నెంబర్ 08562-315672కు కాల్ చేసి తెలియచేయాని కలెక్టర్ పేర్కొన్నారు.

స్వేచ్ఛాయుత ఎన్నికలకు సిద్ధం

- నేటి సాయంత్రం 6.00 నుంచి ప్రచారానికి తెర
- క్రిటికల్ పోలింగ్ కేంద్రాల్లో అదనపు భద్రత
- జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: లోక్‌సభ, శాసనసభ సార్వత్రిక ఎన్నికలు జిల్లాలో స్వేచ్ఛగా, ప్రశాంతంగా సాగేందుకు అన్నిరకాల ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు వెల్లడించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం సాయంత్రం 6 గంటల నుంచి 14వతేది ఉదయం వరకు సైలెన్స్ పీరియడ్ అమలులో ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు ప్రచారాలు, బహిరంగసభలు, ర్యాలీలు, ఊరేగింపులు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రచారాలు నిలిపివేయాలని చెప్పారు. బల్క్ ఎస్ఎంఎస్‌లు పంపరాదన్నారు. నియోజకవర్గంలో ఓటర్లు కాని వారు తక్షణమే వెళ్లిపోవాలని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో ఉల్లంఘనలపై నిఘా ఉంటుందన్నారు. లాడ్జీలు, కల్యాణ మండపాలు, గెస్ట్‌హౌస్‌లు, కమ్యూనిటీ హాళ్లు తనిఖీ నిర్వహిస్తామన్నారు. 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఒక ప్రాంతంలో ఐదుగురి కంటే ఎక్కువ గుమికూడటం నిషేధమన్నారు. జిల్లాలో 16,39,066 మంది ఓటర్లు ఉండగా, 1963 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలతో కలిపితే పోలింగ్ కేంద్రాల సంఖ్య 2035గా ఉంటుందని వివరించారు. జిల్లాలో 527 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు ఉండగా, 14 వల్నరబుల్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఈ పోలింగ్ కేంద్రాల్లో లైవ్ వెబ్‌కాస్టింగ్‌తోపాటు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశామని వివరించారు. జిల్లాలో 3,07,218 ఓటరు గుర్తింపు కార్డులను పోస్టల్ శాఖ ద్వారా, 2064 బీఎల్‌ఓల ద్వారా పంపిణీ చేశామని చెప్పారు. ఓటరు సమాచార స్లిప్పులతోపాటు ఓటరు గైడ్ ప్రతి ఇంటికి పంపిణీ చేశామని చెప్పారు. జిల్లాలోని 337 క్రిటికల్ పోలింగ్ కేంద్ర ప్రాంతాల్లో 610 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామన్నారు. పోస్టల్ బ్యాలెట్ల ద్వారా 19,805 మంది (96.44 శాతం) తమ ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. జిల్లాలో 1221 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్, 742 కేంద్రాల్లో వీడియో గ్రఫీ ఏర్పాటు చేశామన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు

మొదట పార్లమెంటు ఓటు

పోలింగ్ కేంద్రంలోకి వెళ్లే ఓటరుకు తొలుత పార్లమెంటు అభ్యర్థికి ఓటు వేసే అవకాశం కల్పిస్తామని, ఆ తర్వాత అసెంబ్లీ అభ్యర్థికి ఓటు వేయాల్సి ఉంటుందని ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. జిల్లా అంతటా ఇదే పద్ధతి కొనసాగుతుందన్నారు. ఈ అంశంపై సోషల్ మీడియాలో రకరకాల వార్తలు వస్తుండడంతో గందరగోళం చోటుచేసుకున్న నేపథ్యంలో జిల్లా ఎన్నికల అధికారి పై విధంగా స్పష్టత ఇచ్చారు.

మీడియా సహకరించాలి

ఎన్నికల కమిషన్ జారీ చేసిన మీడియా పాసులు ఉన్న జర్నలిస్టులకు మాత్రమే పోలింగ్ సరళిని పరిశీలించేందుకు అనుమతిస్తామన్నారు. రహస్య ఓటింగ్ పద్ధతికి భంగం కలిగించే విధంగా ఓటింగ్ కంపార్ట్‌మెంట్‌లో వీడియోలు, ఫొటోలు తీస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్యూలైన్‌లో ఉన్న వారిని వీడియోలు, ఫోటోలు తీసుకోవచ్చుగానీ ఎన్నికల సరళి గురించి వారితో చర్చించరాదన్నారు. అభ్యర్థులు ఓటు వేసిన తర్వాత వంద మీటర్ల పరిధి దాటాక మాత్రమే ఎలక్ట్రానిక్ మాధ్యమాలు వీడియో బైట్ అడగవచ్చన్నారు.

భారీగా నగదు స్వాధీనం

సీజర్స్ కింద రూ.11 కోట్ల 78 లక్షల విలువచేసే డబ్బు, మద్యం, బంగారు, గంజాయి వంటివి స్వాధీనం చేసుకున్నామన్నారు. 11వ తేది ఎన్నికల పరిశీలకుల సమక్షంలో సిబ్బంది ర్యాండమైజేషన్ నిర్వహిస్తామన్నారు. పోలింగ్ కేంద్రం వంద మీటర్ల పరిధిలోకి మొబైల్ ఫోన్లు, వాహనాలకు అనుమతి లేదన్నారు. ఉదయం 7.00 నుంచి సాయంత్రం 6.00 గంటల వరకు పోలింగ్ సాగుతుందని వివరించారు.

సమస్యలు సృష్టిస్తే కఠిన చర్యలు: ఎస్పీ

పోలింగ్ రోజు ఎవరైనా సమస్యలు సృష్టిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఎస్పీ సిద్దార్థ కౌశల్ హెచ్చరించారు. పోలింగ్ ముగిసిన తర్వాత 20 రోజులపాటు తాను ఇదే పనిలో ఉంటానని చెప్పారు. సమస్యలు సృష్టించే వ్యక్తులపై మ్యానువల్ సర్వైలెన్స్ ఏర్పాటు చేశామన్నారు. అన్ని సెన్సిటీవ్ పోలింగ్ కేంద్రాల్లో గట్టి భద్రత ఉంటుందన్నారు. సైలెన్స్ పీరియడ్‌ను పటిష్టంగా అమలు చేసేందుకు పోలీసు యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. గతంలో కన్నా ఈ యేడు ఎక్కువ బలగాలను వినియోగిస్తున్నామన్నారు. సివిల్ పోలీసులు 3 వేలతోపాటు కేంద్ర బలగాలు, హోం గార్డులు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ వలంటీర్లను వినియోగించుకుంటామన్నారు. 5 నుంచి 10 పోలింగ్ కేంద్రాలను కలిపి ఒక రూటుగా ఏర్పాటు చేశామన్నారు. అలా జిల్లాలో 280 రూట్లు ఉంటాయని, పెట్రోలింగ్ నిర్వహిస్తామన్నారు. క్విక్ యాక్షన్ టీములు రంగంలో ఉంటాయన్నారు. ఈ యేడు ముగ్గురు ఎస్పీ స్థాయి అధికారులు కూడా బందోబస్తు విధులు నిర్వర్తిస్తారని వివరించారు. ఈ సమావేశంలో కమిషనర్ ప్రవీణ్‌చంద్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పాల్గొన్నారు.

ఖరీఫ్ ప్రణాళిక ఖరారు

- జిల్లాకు 5323 క్వింటాళ్లు పచ్చి రొట్ట విత్తనాలు
- 5849 క్వింటాళ్లు వేరుశనక్కాయలు.. 560 క్వింటాళ్లు కందులు
- 73,582 మెట్రిక్ టన్నులు ఎరువులు అవసరంగా ప్రతిపాదనలు
- త్వరలో జిల్లాకు చేరనున్న ఎరువులు, విత్తనాలు

కడప అగ్రికల్చర్: రైతుల వ్యవసాయానికి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. పంటలసాగుకు సాయంగా రైతు భరోసాను అందిస్తూ ఆదుకుంటోంది. దీంతోపాటు విత్తనం మొదలు పంట దిగుబడుల విక్రయం వరకు అన్ని రకాలుగా అండగా నిలుస్తోంది. అలాగే పంటలసాగుకు అవసరమైన అన్ని రకాల సేవలను ఉన్న ఊర్లోనే రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తూ అడుగడుగునా ఆదుకుంటూ భరోసాగా నిలుస్తోంది. ఇందులో భాగంగా ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతుల పంటల సాగుకు అవసరమైన ఎరువులతోపాటు వేరుశనగ, శనగ, పచ్చిరొట్టి విత్తనాలే ఏ మేరకు అవసరమని వ్యవసాయ అధికారులు గుర్తించి ఇందుకు సంబంధించి విత్తన,ఎరువుల ప్రణాళికలను సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించారు. వేరుశనగ, పచ్చిరొట్టి విత్తనాలను సబ్సిడీతో అందించనుంది. ఇందులో వేరుశన క్కాయలకు, పచ్చిరొట్టి విత్తనాలైన జీలుగలు, జనుములు, పిల్లపెసరకు ఎంత మేరకు సబ్సిడీ ఇవ్వాలనేది ప్రభుత్వమే నిర్ణయించనుంది.

ఖరీప్‌కు కేటాయించిన ఎరువుల వివరాలు ఇలా....

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లాకు అన్ని రకాల కాంప్లెక్స్ ఎరువులకు సంబంధించి ప్రణాళిక సిద్ధం చేశారు. ఖరీఫ్ సీజన్ మొత్తానికి 73,582 మెట్రిక్ టన్నుల ఎరువులను అవసరంగా వ్యవసాయ అధికారులు గుర్తించి ప్రభుత్వానికి నివేదికలను సమర్పించారు. సంబంధిత ఎరువులను ఆయా ప్రాంత సాగుకు బట్టి రైతులకు ఏ మేరకు ఏయే పంటను సాగు చేస్తారు. అందుకు ఏ రకమైన ఎరువులు ఏ మేరకు అవసరమో గుర్తించి ఆ మేరకు ఆయా రైతు బరోసా కేంద్రంలో సంబంధిత ఎరువులను అందుబాటులో ఉంచనున్నారు. ఎరువులకు సంబందించి ఖరీస్ సీజన్‌కుగాను 21,208 మెట్రిక్ టన్నుల యూరియా, 9226 మెట్రిక్ టన్నుల డీఏపీ, 2791 మెట్రిక్ టన్నుల మ్యూరేట్ ఆఫ్ పోటాస్, 3997 మెట్రిక్ టన్నుల సింగల్ సూపర్ పాస్పెట్, 36,362 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులను అవసరంగా గుర్తించి నివేదికలను ప్రభుత్వానికి నివేదించారు.



రైతులకు అందించనున్న ఎరువులు

జిల్లాకు అవసరమైన విత్తనాల వివరాలు..

జిల్లాకు సంబంధించి ఖరీఫ్ సీజన్‌కుగాను జీలుగలు 4780 క్వింటాళ్లు, జనుములు 463 కింట్వాళ్లు, పిల్లపెసర 80 క్వింటాళ్లు , వేరుశనగ క్కాయలు 5849 క్వింటాళ్లు ఇలా అన్ని రకాల విత్తనాలకు సంబంధించి 12,252 క్వింటాళ్లు అవసరంగా గుర్తించారు. ఇందులో వేరుశనక్కాయలకు సంబంధించి కే6 రకానికి సంబంధించి వేరుశనక్కాయలు 3447 క్వింటాళ్లుకాగా నారాయణికి సంబంధించి 1300 క్వింటాళ్లు, లేపాక్షి 100 క్వింటాళ్లు, టిసిజిఎస్1694 రకానికి సంబంధించి 1000 క్వింటాళ్లు అవసరంగా గుర్తించారు. అలాగే కందులకు సంబంధించి 560 క్వింటాళ్లుకాగా ఇందులో ఎల్ఆర్‌జీ 51 రకానికి సంబంధించి 270 క్వింటాళ్లు, ఐసిపిఎల్ – 85063 రకానికి సంబంధించి 290 క్వింటాళ్లు అవసరంగా గుర్తించారు. అలాగే మినుములు 490 క్వింటాళ్లు, పెసలు 30 క్వింటాళ్లు, నూగులు 0.34 క్వాంటాళ్లు అవసరంగా అధికారులు గుర్తించారు. త్వరలో వీటికి సంబంధించి ఎంతెంత సబ్సిడీ ఇవ్వాలనేది ప్రభుత్వం కేటాయించనుంది.

విత్తనాలు కేటాయింపు ఇలా... (క్వింటాళ్లలో)

విత్తనాలు	కేటాయింపు
పచ్చిరొట్ట విత్తనాలు	5323
వేరుశనగ కాయలు	5849
కందులు	560
మినుములు	490
పెసలు	30
మొత్తం	12252

క్లుప్తంగా

కాలిపోయిన గుర్రం'కొండలు'



మిడిమూలపు కొండలపై మంటలు

గుర్రంకొండ : గుర్రంకొండలోని సాయిబాబా గుడి వెనుక వైపు ఉన్న మిడిమాలపు కొండలపై చెట్లు (గుర్రంకొండలు) మొత్తం కాలిపోయాయి. గురువారం రాత్రి గుర్తుతెలియని దుండగులు కాలనీ పరిసరాల్లోని కొండలకు నిప్పు పెట్టడంతో దావానలంలా వ్యాపించి 200 ఎకరాల్లో వృక్ష సంపద కాలిపోయింది. అందులో జంతువులు మంటలకు విలవిలలాడిపోయాయి. రాత్రంతా మండుతూ ఉండడంతో నిప్పుకణాలు గాలికి ఎగసిపడ్డాయి.

వివాహిత అదృశ్యం

బి.కొత్తకోట : ఓ వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. బి.కొత్తకోట తేరువీధికి చెందిన రాజశేఖర్‌కు చిన్నదేవి(20)తో మూడు నెలల క్రితం వివాహమైంది. బుధవారం నుంచి చిన్నదేవి కనిపించకపోవడంతో పలుచోట్ల వెతికారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కటింగ్ మెషిన్ పడి కార్మికుడికి గాయాలు



గాయాలపాలైన చేనేత కార్మికుడు కుమార్

మదనపల్లె : ప్రమాదవశాత్తూ కటింగ్ మెషిన్ చేతిమీద పడడంతో చేనేత కార్మికుడు గాయపడిన సంఘటన శుక్రవారం రాత్రి కురబలకోట మండలంలో జరిగింది. చేనేత నగర్‌లో నివాసం ఉంటున్న కే.కుమార్(33) తాను పని చేస్తున్న చోటులో కర్ర అడ్డుగా ఉండటంతో తొలగించేందుకు కటింగ్ మెషిన్‌తో పనిచేస్తున్నారు. ప్రమాదవశాత్తూ మిషన్ జారి మీద పడటంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. గమనించిన స్థానికులు 108లో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

వీఆర్‌ఏ ఎన్నికల ప్రచారం

బ్రహ్మంగారిమఠం : బి.మఠం మండలం డి.నేలటూరు వీఆర్‌ఏ నాగసుబ్బయ్య యాదవ్ శుక్రవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. డి.నేలటూరులో టీడీపీ నాయకులతో తిరుగుతూ మైదుకూరు టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌కు ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లను ప్రభావితం చేసినట్లు తెలిసింది. నియమావళి ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులు ఎలాంటి ప్రచారంలో పాల్గొనకూడదు. అయితే ఆయన మాత్రం మీకు ప్రభుత్వ భూములు కావాలంటే టీడీపీని గెలిపించాలని కోరడం ఏమిటంటూ స్థానికులు చర్చించుకున్నారు.



డి.నేలటూరులో ఎన్నికల ప్రచారంచేస్తున్న వీఆర్‌ఏ నాగసుబ్బయ్య యాదవ్ (బ్లూ షర్ట్)

టీడీపీని వీడీ వైఎస్సార్‌సీపీలో చేరిక



చెన్నూరు తూర్పు హరిజనవాడలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరిన దళితులు

చెన్నూరు : మండలంలోని కొండపేట గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ గుడిపాటి రాజేష్, ఎస్సీ కాలనీకి చెందిన 15 కుటుంబాలు, ఇతర ప్రాంతాల నుంచి మరో 30 కుటుంబాలు శుక్రవారం టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి పార్టీ కండువా వేసి వారిని సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి ఆకర్షితులై నేడు పార్టీలో చేరామని కొండపేట గ్రామస్థులు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాల వారు వైఎస్సార్‌సీపీకి బ్రహ్మరథం పడుతున్నారన్నారు. పార్టీ కోసం రెండు రోజులు పని చేస్తే రాష్ట్ర అభివృద్ధితో తమ వంతు భాగస్వాములు అవుతారన్నారు. కూటమి నాయకులకు ఓటుతో బుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు గుమ్మా రాజేంద్రప్రసాద్ రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, మండల కన్వీనర్ జీఎన్.భాస్కర్ రెడ్డి, సర్పంచ్ తుంగ చంద్రశేఖర్ యాదవ్, ఎంపీటీసీ నాగిరెడ్డి, ముదిరెడ్డి సుబ్బారెడ్డి, రాజేష్, అన్వర్ భాష, హస్రత్, వారిష్, భాష, చౌరయ్య, వెంకటసుబ్బయ్య, పుల్లయ్య, గంగయ్య, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కౌన్సిలర్‌పై
టీడీపీ నాయకుల దాడి

దాడి చేసిన వారిలో పంచాయతీ కార్యదర్శి



చికిత్స పొందుతున్న కౌన్సిలర్ ఈశ్వర్‌నాయక్

మదనపల్లె : పట్టణంలోని 25వవార్డు కౌన్సిలర్ పి.ఈశ్వర్‌నాయక్(37), అతడి సోదరుడు అమరేంద్రనాయక్(40), నక్కలదిన్నెవాసి వినోద్‌కుమార్‌నాయక్(30)లపై శుక్రవారం సాయంత్రం టీడీపీ నాయకులు దాడికి పాల్పడ్డారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సాయంత్రం 7 గంటల ప్రాంతంలో వైఎస్సార్ సీపీ 25వ వార్డు కౌన్సిలర్ ఈశ్వర్‌నాయక్ ఇంటింటి ప్రచారంలో పాల్గొని వస్తుండగా, స్థానికులైన మునస్వామినాయక్, కొత్తవారిపల్లె పంచాయతీ కార్యదర్శి గిరిధర్‌నాయక్, జయానాయక్‌లు తమ ఓట్లు 25వవార్డు నక్కలదిన్నె నుంచి గాంధీపురానికి బదిలీ అయ్యేందుకు నీవే కారణమంటూ గొడవకు దిగారు. ఇందులో తనకు ఏమాత్రం సంబంధం లేదని, సర్దిచెప్పేందుకు ప్రయత్నించినప్పటికీ వారు కర్రలు, రాళ్లతో దాడికి పాల్పడ్డారు. దాడిలో ఈశ్వర్‌నాయక్ సోదరుడు అమరేంద్రనాయక్, స్థానికుడు వినోద్‌కుమార్‌నాయక్‌లు గాయపడ్డారు. బాధితులను స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అనంతరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో దాడిఘటనపై ఫిర్యాదుచేశారు. ఈశ్వర్‌నాయక్‌ను వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డిలు పరామర్శించారు. దాడి ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ వలీబాషు తెలిపారు.

పెద్ద అస్థానముల ఉరుసు



ఫకీర్లతో జెండాలను ప్రారంభిస్తున్న పీఠాధిపతి సయ్యద్ షా గౌస్‌పీరాఖాద్రి

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలోని పలగాడివీధిలో వెలసిన సయ్యద్ షా బడే గౌస్‌పీరా ఖాద్రీ(పెద్ద అస్థానం) ఉరుసు ఉత్సవం నిషాన్‌తో శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. అస్థాన ఎ గౌసియా దర్గా పీఠాధిపతి సయ్యద్ షా గౌస్‌పీరాఖాద్రి ఇంటి నుంచి ప్రారంభమైన జెండాలను పట్టణంలోని పురవీధుల గుండా ఊరేగించిన అనంతరం జెండా ఆవిష్కరించారు. భక్తులు ఫాతేహా సమర్పించారు. పీఠాధిపతి మాట్లాడుతూ ఈ నెల 12న మైనార్టీ సోదరుల పిల్లలకు ఉచిత వడుగుల కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ నెల 22 ,23వ తేదీల్లో ఖవ్వాలీ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఠాధిపతి తనయులు సయ్యద్ షా తాహీర్‌పీరా ఖాద్రి, సయ్యద్ షా అతహర్ ఖాద్రి, దర్గా అధ్యక్షుడు మహమ్మద్ గౌస్, భాషా, జహంగీర్ భాషా, అబ్దుల్ రజాక్ పాల్గొన్నారు.

ఏపీఎల్ ఎంపికలకు విశేష స్పందన



ఎంపికల్లో పాల్గొన్న క్రీడాకారులు



హాజరైన క్రీడాకారులు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో శుక్రవారం నిర్వహించిన ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) సీజన్-3 ఎంపికలకు క్రీడాకారుల నుంచి విశేష స్పందన లభించింది. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎంపికలకు కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం, నెల్లూరు జిల్లాలకు చెందిన క్రీడాకారులు హాజరయ్యారు. సౌత్‌జోన్ కన్వీనర్ అవ్వారు రెడ్డిప్రసాద్, అసిస్టెంట్ డెవలప్‌మెంట్ మేనేజర్ ఎస్.ఖాజామైనుద్దీన్ మాట్లాడుతూ త్వరలో నిర్వహించనున్న ఆంధ్రా ప్రీమియర్ లీగ్ సీజన్-3 మ్యాచ్‌లకు సంబంధించి జట్ల కోసం ఈ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో ఎంపికలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వై. శివప్రసాద్, కె.విష్ణు మోహన్‌రావు, పైడికాల్వ విజయ్‌కుమార్, ఎల్.మునికుమార్‌రెడ్డి, ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలులతో అరటి పంటకు నష్టం



రామన్నూతనపల్లెలో నేలకూలిన యాలక్కి అరటిపంట

లింగాల : లింగాల మండలం రామన్నూతనపల్లె, ఇంటిఓబయ్యపల్లె గ్రామాల్లో గురువారం రాత్రి వీచిన ఈదురు గాలులకు గెలలతో ఉన్న అరటి పంట నేలకూలింది. కోతకు వచ్చిన పంట నేలకూలడంతో రైతులకు తీరని నష్టం వాటిల్లిందని, తమను ఆదుకోవాలని రామన్నూతనపల్లెలో దీపక్, కుళ్లాయిరెడ్డి, కుళ్లాయప్ప, బాబురెడ్డి, గొంది గంగరాజు, ఇంటిఓబయ్యపల్లె రైతులు మధుసూదన్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, రమణారెడ్డి తెలిపారు. ఆయా గ్రామాల్లో సుమారు రూ.50 లక్షల దాకా నష్టం వాటిల్లిందని ఉద్యానశాఖ అధికారులు అంచనా వేశారు.

ఇండిపెండెంట్ల ఇంటింటి ప్రచారం



ఇండిపెండెంట్ అభ్యర్థులుగా ఎన్నికల బరిలో ఉంటూ టీడీపీ అభ్యర్థికి ప్రచారం చేయడంపై నిలదీస్తున్న మోతీనగర్ స్థానికులు



మెడలో టీడీపీ కండువా కప్పుకుని ప్రచారం చేస్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షాజహాన్ భార్య, ఇండిపెండెంట్ అభ్యర్థి గుల్నాజ్‌బేగం

- టీడీపీ స్లిప్పులు పంచుతుండగా నిలదీసిన జనం
- బీఎల్వోలపై నెట్టివేసి తప్పించుకునే ప్రయత్నం

మదనపల్లె : స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో నిలిచి.. టీడీపీ అభ్యర్థుల స్లిప్పులు పంచుతున్న వారిని జనం నిలదీసిన సంఘటన శుక్రవారం మదనపల్లెలో చోటు చేసుకుంది. మరో రెండు రోజుల్లో ఎన్నికలు జరుగుతున్న తరుణంలో ఎలాగైనా గెలుపొందడానికి టీడీపీ ప్రయత్నిస్తోంది. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా షాజహాన్‌బాషా నామినేషన్ దాఖలు చేశారు. అంతేగాక పక్కా ప్రణాళికతో తన భార్య గుల్నాజ్‌బేగం, అనుచరుడు నిసార్ అహ్మద్‌లను స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేయించారు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం గుల్నాజ్‌బేగానికి రూమ్ కూలర్, నిసార్ అహ్మద్‌కు వజ్రం గుర్తులను ఆర్వో హరిప్రసాద్ కేటాయించారు. ప్రధాన పార్టీల అభ్యర్థులకు ప్రచారం చేయడం, ఎన్నికల ప్రచార సామగ్రిని తమ వాహనాల్లో తరలించడం, నియమావళికి వ్యతిరేకంగా వ్యవహరించడం చేస్తే చర్యలు తీసుకుంటామని ఆర్వో వారిని హెచ్చరించారు. ఇవేమీ పట్టని ఆ అభ్యర్థులు తమ అనుచరులను తీసుకుని మోతీనగర్‌లో టీడీపీ కూటమి తరపున స్లిప్పులను పంపిణీ చేయడమేగాక, డబ్బులు ఇస్తామని చెపుతూ ముందుకుసాగారు. దీన్ని గమనించిన స్థానికులు ఇండిపెండెంట్ అభ్యర్థులుగా ఉంటూ, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థికి ప్రచారం చేయడమేంటని నిలదీశారు. దీంతో స్థానికులకు, టీడీపీ నాయకులకు మధ్య వివాదం జరిగింది. ఎన్నికల అధికారులకు సమాచారం అందించడంతో వారు అక్కడకు చేరుకుని, స్లిప్పుల పంపిణీపై ప్రశ్నించారు. బీఎల్వోలు సక్రమంగా పంపిణీ చేయలేదని ఫిర్యాదులు రావడంతో తామే పంచేందుకు వచ్చామని చెప్పారు. ఎన్నికల అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేశారు.

మద్యం దుకాణం వద్ద హల్‌చల్



మద్యం దుకాణం ఎదుట ఇంటర్వ్యూ ఇస్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షాజహాన్‌బాషా

మదనపల్లె : టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షాజహాన్‌బాషా(జహా) ప్రచార పిచ్చి పీక్స్‌కు చేరుకుంది. ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద సేల్స్‌మెన్‌లపై పలు ప్రశ్నలు సంధించి హల్‌చల్ చేశారు. ఎల్లో మీడియాను వెంటపెట్టుకుని చిత్తూరు బస్టాండులోని ప్రభుత్వ మద్యం దుకాణం వద్దకు చేరుకుని 15 నిమిషాలపాటు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇదేమి ప్రచార యావరా బాబూ అంటూ స్థానికులు ముక్కున వేలేసుకున్నారు. అంతటితో ఊరుకోని షాజహాన్‌బాషా సేల్స్‌మెన్‌ను ఏ బ్రాండులు అమ్ముతున్నారు? ఏ డిస్టిలరీస్‌లో దీన్ని తయారు చేశారు? అంటూ ప్రశ్నించి జిమ్మిక్కులు ప్రదర్శించారు. కొందరు ఈ తతంగాన్ని వీడియో తీసి సీవిజిల్ యాప్‌లో ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యమంటూ చర్చించుకోవడం విశేషం.

ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు

రాయచోటి : సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా జిల్లా పోలీస్ యంత్రాంగం పటిష్టమైన చర్యలు చేపట్టినట్లు ఎస్పీ బి.క్రిష్టారావు పేర్కొన్నారు. శిక్షణలో ఉన్న 8 మంది ఐపీఎస్ అధికారులు శుక్రవారం అన్నమయ్య జిల్లాకు వచ్చారు. జిల్లా ఎస్పీ బి.క్రిష్టారావును జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో చేపట్టిన పోలీస్ చర్యల గురించి ఎస్పీ ట్రైనింగ్ ఎస్పీలకు వివరించారు. ఈ నెల 13న జిల్లాలో జరగనున్న ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు, ఎన్నికల ప్రవర్తన నియమావళి సమర్థవంతంగా అమలు చేయడానికి బందోబస్తు ఏర్పాట్ల గురించి ఎస్పీని అడిగి తెలుసుకున్నారు. అక్రమ మద్యం, నగదు, ఇతర విలువైన వస్తువుల కట్టడి చెయ్యడానికి తీసుకున్న చర్యల గూర్చి వివరించారు. శిక్షణలో భాగంగా జిల్లాలోని అన్ని సబ్ డివిజన్‌లకు వారిని కేటాయించారు. సెక్టర్ మొబైల్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు నిర్వహించే విధులు, ఇతరత్రా వాటి గురించి జిల్లా ఎస్పీలకు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



మృతిచెందిన శివకుమార్

కొండాపురం : గుర్తుతెలియని వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో చింతకాయల శివకుమార్(17) శుక్రవారం అక్కడికక్కడే మృతిచెందినట్లు హెడ్ కానిస్టేబుల్ శంకర్‌రెడ్డి తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని తాళ్లప్రొద్దుటూరు గ్రామానికి చెందిన వెంకటరమణ కుమారుడు శివకుమార్ తన స్వగ్రామం నుంచి జమ్మలమడుగుకు ద్విచక్ర వాహనంలో వెళ్తున్నారు. ఏటూరు వంతెన సమీపంలో జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శంకర్‌రెడ్డి తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ చదువు మధ్యలో ఆపేసిన లేదా ఫెయిల్ అయిన వారికి 10th, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, B.Tech, BCA, MCA పాసయ్యే చాన్స్ కలదు. నరేష్ అకాడమి, కడప. 7569470028

SINGLE SITTING

■ SINGLE SITTING : 10th, 12th, B.A., B.Com., B.Sc., M.A., M.Com., M.Sc., M.B.A, BBA, BCA, B.Tech., D.Ed., B.Ed., Agriculture, Pharmacy, Nursing, (For Drop outs /Back Logs) from recognised Universities. Exams in May/June Cont: ✆ : 73383 76874

■ 10th పాస్ + పాలిసెట్ లో క్వాలిఫైడ్ ర్యాంకు స్టూడెంట్స్‌కి పాలిటెక్నిక్ కోర్సు నందు ఫ్రీ ఎడ్యుకేషన్, కాలేజీలో హాస్టల్ వసతి కలదు. క్వాలిఫై కాని స్టూడెంట్స్‌కి ఓన్లీ హాస్టల్ ఫీజు. సంప్ర : జి. మురళీ, సెల్ : 8080661651.

WANTED

■ సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 12 గంటలు డ్యూటీ, మగవారు మాత్రమే. వివరములకు సంప్రదించండి. సెల్ : 72880 04466.

■ సెక్యూరిటీ సూపర్‌వైజర్ SO,ASO జీ: 14,500, భోజనం,రూంఫ్రీ, కోదూరు దగ్గర వర్షం మ్యాంగో జ్యూస్‌ఫ్యాక్టరీలో, కడపటౌన్‌లో సెక్యూరిటీగార్డ్స్ కావలెను. జీతం:12,500, 9989139239, 8179196300.

■ గ్లోబల్ మిషన్ కంపెనీ నందు వర్క్ చేయటానికి టీం లీడర్స్ కావలెను. అర్హత: 10th to PG పార్ట్ టైం: 28,000, ఫుల్ టైం: 34000. Contact : 8341236768

■ Wanted teachers in Maths-up to 9th Salary-20k to 25k. English - up to 9th class Salary 20k to 25k. Minimum Exp 2 to 3 years interested candidates may send their resumes to Mobile. 9441011084 Ushakiran High School, Vempalli, Ysr Kadape.

■ సూపర్‌వైజర్స్ కావలెను. రాయచోటి మునిసిపాలిటీ (Clap programme) నందు చెత్త సేకరణ ఆటోలను పర్యవేక్షించేందుకు అనుభవం గల వారు కావలెను. ✆ 8977937517, 9000274257

■ పర్మినెంట్ గా VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ: 15000-40000, ఫ్రీ రూమ్+భోజనం, Hyd. Ph: 7995984445

గమనిక

సాక్షి క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705907418
9705944423
9010223797
9010072409

ట్రాక్టర్ బోల్తా పడి ఒకరి దుర్మరణం



వెంకట ముని (ఫైల్)

నిమ్మనపల్లె : ట్రాక్టర్ బోల్తా పడి ఓ వ్యక్తి దుర్మరణం పాలైన సంఘటన గురువారం రాత్రి నిమ్మనపల్లె మండలంలో జరిగింది. చౌడేపల్లె మండలం, పంచాయతీ పాదలపల్లికి చెందిన చిన్నప్ప కుమారుడు వి.వెంకటముని(47), గురువారం సాయంత్రం తన సొంత ట్రాక్టర్‌లో వరిగడ్డి తీసుకుని వాల్మీకిపురం మండలం చింతపర్తిలో దింపి తిరిగి ఇంటికి వస్తున్నాడు. చింతపర్తివారిపల్లె మలుపు వద్ద వేగాన్ని నియంత్రించలేకపోవడంతో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ట్రాక్టర్ కింద పడిన వెంకటముని అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. స్థానికులు నిమ్మనపల్లె పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య పార్వతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

ప్రమాదవశాత్తూ బాలుడి మృతి



కుశాల్ కుమార్ రాజు (ఫైల్)

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండలంలోని ఈటమాపురంలో సెల్‌ఫోన్ చూస్తూ ప్రమాదవశాత్తు కింద పడి ఓ బాలుడు మృతిచెందాడు. ఈ సంఘటన ఉదయం 6.30 గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఈటమాపురం గ్రామానికి చెందిన మహేశ్వర్ రాజు, అశ్వనిల మొదటి కుమారుడు కుశాల్ కుమార్ రాజు(7) తన తాత వద్ద ఉన్న సెల్ ఫోన్ తీసుకొని ఇంటి గుమ్మం అరుగుమీద ఫోన్ చూస్తూ వెనుకకు జరుగుతూ అరుగుపై నుంచి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో తల వెనుక భాగం ముందుగా నేలను తాకడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశానికి వెళ్లిన మహేశ్వర్‌రాజు విషయం తెలియగానే ఇంటికి వచ్చి కన్నీరు మున్నీరుగా విలపించాడు. ఈ సంఘటనతో వారి కుటుంబంతో పాటు గ్రామంలో కూడా విషాదఛాయలు అలుముకున్నాయి.

మద్యం బాటిళ్లు స్వాధీనం



సెబ్ అధికారుల అదుపులో నిందితులు, మద్యం బాటిళ్లు

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని కోనంపేట గుండ్లచెరువు క్రాస్ వద్ద ఇద్దరు వ్యక్తులు ఆటోలో 98 కర్ణాటక మద్యం బాటిళ్లను తరలిస్తుండగా లక్కిరెడ్డిపల్లి సెబ్ అధికారులు శుక్రవారం పట్టుకున్నట్లు సెబ్ సిఐ చంద్రశేఖర్ తెలిపారు. సార్వత్రిక ఎన్నికలు దృష్టిలో ఉంచుకొని ప్రతి వాహనాన్ని తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. లక్కిరెడ్డిపల్లి మండలం కొత్తరాచపల్లెకు చెందిన జనార్దన్ రాజు, మిద్దకాడ పల్లికి చెందిన షేక్ అబ్దుల్ గఫార్‌లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

వైభవంగా అక్షయ తదియ





పూలంగి సేవలో చెన్నకేశవ స్వామి, నంది వాహనంపై కొలువుదీరిన కామాక్షి వైద్యనాథుడు

వల్లూరు : పవిత్ర పుణ్య క్షేత్రమైన పుష్పగిరి కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి,లక్ష్మీ చెన్నకేశవ స్వాముల బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం అక్షయ తదియ ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుండి భక్తులు తరలివచ్చారు. పెన్నా నదిలో నీరు లేక పోవడంతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మోటార్ల వద్ద స్నానాలు ఆచరించి స్వామి వార్లను దర్శించుకున్నారు. కొందరు తలనీలాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనేక మంది భక్తులు బ్రాహ్మణుల ఆధ్వర్యంలో తమ పితృదేవతలకు పిండ ప్రదానం చేశారు.

వైభవంగా చెన్నకేశవుని పూలంగి సేవ–

చెన్నకేశవ స్వామికి పూలంగి సేవను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు అఖిల్ దీక్షితులు ఆధ్వర్యంలో స్వామిని పట్టు వస్త్రాలు, పూలతో అలంకరించారు. ధరింప చేసి వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. భక్తులకు ఉచితంగా లడ్డూ ప్రసాదాలను అందజేశారు. కామాక్షీ వైద్యనాథేశ్వర ఆలయంలో అర్చకులు శ్రీనివాసమూర్తి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీచక్ర సహిత కామాక్షీ అమ్మవారికి పూలంగి సేవ నిర్వహించారు. రాత్రి చెన్నకేశవ స్వామి తనకు ప్రీతి పాత్రమైన గరుడ వాహనంపై, కామాక్షీ వైద్యనాథేశ్వర స్వాములు నంది వాహనంపైభక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల సందర్భంగా పలువురు ట్రాక్టర్లు, , ఆటోల యజమానులు వల్లూరు నుంచి పుష్పగిరి వరకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించారు. ఎస్‌బీఐ చెన్నూరు, ఖాజీపేట బ్రాంచ్‌లు సంయుక్తంగా రీజనల్ మేనేజర్ కిషోర్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, శుద్ధజలం పంపిణీ చేశారు. పలువురు దాతలు చెక్క భజన, హరి కథా కాలక్షేపాలను ఏర్పాటుచేశారు. ఈవో శ్రీనివాసులు, అర్చకులు సుమంత్ దీక్షితులు, రాజేశ్వర శర్మ పాల్గొన్నారు.

నేడు కళ్యాణోత్సవం

శనివారం ఉదయం 10 గంటలకు కామాక్షీ వైద్యనాథ స్వాములకు, చెన్నకేశస్వామికి రాత్రి 7 గంటల నుంచి కళ్యాణోత్సవం జరుగుతుంది. రాత్రి గజవాహన సేవ జరుగుతుంది.



చెన్న కేశవ స్వామి ఆలయం వద్ద భక్తులు



ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మోటార్ల వద్ద స్నానాలు చేస్తున్న భక్తులు